క్లుప్తంగా

ఎన్‌ఎంఎంఎస్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

చాగలమర్రి: జాతీయ ఉపకార వేతనాలకు నిర్వహించిన పరీక్షలో చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు ఇవర్సాన్, మునవర్ బాషా ప్రతిభ కనబరిచారు. ఈ నేపథ్యంలో ఆ విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఐడీకే శాస్త్రి అభినందించారు. తమ విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపిక కావడంతో సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులు, మిగతా ఉపాధ్యాయుల పాత్ర ఉందన్నారు.

మంత్రికి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నిర్వాహకులు

నంద్యాల (అర్బన్): మహానందిలో గురువారం అఖిల భారత ఒంగోలు జాతి బలప్రదర్శన పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీలకు మైనార్టీ శాఖ మంత్రి ఫరూక్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. బుధవారం నంద్యాలలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానంది పుణ్య క్షేత్రం వద్ద ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



ఇళ్లవద్దకు వెళ్లి వైద్య చికిత్స చేస్తున్న యునాని డాక్టర్ షాకీరాబేగం

దొర్నిపాడు: ప్రకృతి ప్రసాదించిన ఎన్నో అద్భుతాల నుంచి పుట్టిన గొప్ప వైద్యం యునాని అని ని డాక్టర్ షాకీరా బేగం అన్నారు. బుధవారం దొర్నిపాడులో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణంగా యునానిలో మొక్కల ఉత్పత్తుల నుంచి మందు తయారు చేస్తారన్నారు. అనంతరం వివిధ వ్యాధులతో ఇబ్బందులు పడుతున్న వారికి మందులు పంపిణీ చేశారు.

మతిస్థితిమితం లేని మహిళను ఆసుపత్రికి తరలింపు



జూటూరు సుభాషిణిని చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో మతిస్థిమితం సరిగా లేని జూటూరు సుభాషిణి అనే మహిళను చికిత్స నిమిత్తం వైఎస్సార్ కడప పట్టణానికి చెందిన మనోబంధు ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ పుత్తా శివారెడ్డి ఆసుపత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు. ఈ సంస్థ రెండు రోజులుగా గ్రామంలో నిరాశ్రయులు, మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గురించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించింది. సుభాషిణి అనే మహిళను గమనించి చికిత్స కొరకు కడప పట్టణంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌కు అంబులెన్స్‌లో తరలించారు. ఈ విషయాన్ని చాగలమర్రి ఏఎస్‌ఐ అబ్దుల్ నబీకి తెలియజేసినట్లు స్వచ్ఛంద సేవా సంస్థలు సభ్యులు తెలిపారు.






సంజీవ్ నగర్ రామాలయంలో కాశీ విశ్వనాథునికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం, క్రిష్టిపాడు శివాలయంలో భక్తిగీతాలతో జాగారం, మాయలూరులో శివ పార్వతుల కళ్యాణోత్సవం, బైటి పేటలో నాగనందీశ్వరునికి హారతి ఇస్తున్న వేదపండితుడు

శివోహం

- శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివనామస్మరణ
- వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు

నంద్యాల(వ్యవసాయం): శివనామ స్మరణతో శైవ క్షేత్రాలు మార్మోగాయి. భక్తజనంతో పులకించాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని శివాలయాల్లో పరమ శివునికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, రుద్ర హోమాలు చేశారు. లింగాష్టకాన్ని, శివ పంచాక్షరి మంత్రాన్ని జపించారు. ఉపవాసం ఉండి జాగరణ చేశారు. లింగోద్భవ ఘట్టం, శివపార్వతుల కల్యాణం, గ్రామోత్సవం, ప్రభోత్సవాలు శోభాయమానంగా జరిగాయి. ఈ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయాధికారులు అధికారులు, ఆలయాల కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

➡ నవనందుల్లో మొదటి దైన నంద్యాల పట్టణంలోని ప్రథమనంది క్షేత్రంలో తెల్లవారుజాము నుంచే అభిషేకాలు ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు క్యూకట్టి స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం స్వామి వారికి అన్నాభిషేక కార్యక్రమం నిర్వహించారు. కేదారేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. రాత్రి లింగోద్భవ కాలం అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించారు.

➡ సోమనంది క్షేత్రంలో సోమనందికి, సోమేశ్వరదేవికి భక్తులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. బైటిపేటలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో నవనందుల్లో రెండవ నంది నాగనంది భక్తులు స్వామికి జలాభిషేకం చేసి పుష్పాలంకరణ నిర్వహించారు.

➡ స్థానిక చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న శ్రీభీమేశ్వర స్వామికి భక్తులు అభిషేకాలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు.

➡ బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలతో పాటు, ప్రత్యేక పూజలు చేశారు. రోజాకుంటలోని నాగలింగేశ్వరస్వామి ఆలయంలో భక్తులు స్వామి వారికి పూజలు, అభిషేకాలు చేశారు. రాత్రి కల్యాణోత్సవం నిర్వహించారు.

➡ మెయిన్‌బజార్‌లోని అమ్మవారి శాలలో నగరేశ్వరస్వామికి ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఒట్టివేర్ల నీళ్లతో అభిషేకం నిర్వహించారు.

➡ సంజీవనగర్ రామాలయంలో భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో కాశీవిశ్వేరస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలు చేశారు. రాత్రి 108 కలశాలతో అభిషేకం నిర్వహించారు. లింగోద్భవ అనంతరం కాశీవిశ్వనాథునికి, కాశీ విశాలాక్షి అమ్మవారికి కల్యాణం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో చంద్రశేఖర స్వామి



నంద్యాలలోని ప్రథమ నంది ఆలయంలో అభిషేకాల కోసం క్యూలో నిల్చున్న భక్తులు

➡ స్థానిక నాగులకుంట రోడ్డులోని నాలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయమే స్వామి వారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి రాత్రి వివిధ పండ్ల రసాలతో స్వామి వారికి అభిషేకం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు.

➡ గాంధీచౌక్‌లోని శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో స్వామి అమ్మవార్ల కల్యాణం కనుల పండువగా సాగింది.

➡ గుడిపాటిగడ్డలోని మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఉదయమే అభిషేకాలు భక్తులు పెద్ద ఎత్తున నిర్వహించారు. రాత్రి అశేష భక్తజనం మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణం జరిపించారు.

➡ యోగా చైతన్య కేంద్రంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని సామూహిక మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు.

➡ హౌసింగ్ బోర్డు కాలనీలోని అమ్మా స్పటిక లింగేశ్వర ఆలయంలో లింగానికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహించారు. రాత్రి లింగోద్భవ కార్యక్రమం అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.

గోస్పాడు: మండల పరిధిలోని గ్రామాల్లో శివరాత్రి పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. యాళ్లూరు, జూలేపల్లె, జిల్లెల్ల, గోస్పాడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలువురు రాత్రి జాగారణ చేశారు.

➡ నంద్యాల మండలంలోని కానాల, చాబోలు, అయ్యలూరు, పోలూరు, చాపిరేవుల, మిట్నాల తదితర గ్రామాల్లో వెలసిన శివాలయాలు శివనామ స్మరణతో హోరెత్తాయి. రాత్రి జాగారణ సందర్భంగా హరికథలు, కోలాటలు, భజనలతో భక్తులు దైవసన్నిదిలో ఉపవాసదీక్షలు నిర్వహించారు. కానాల బుగ్గరామేశ్వర స్వామి ఆలయంలో మహానందికి వెళ్లే భక్తుల సందడి కనిపించింది.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

ఉయ్యాలవాడ: శివరాత్రిని పురస్కరించుకుని ఉయ్యాలవాడలోని అగస్తీశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. మండల పరిధిలోని మాయలూరు, కొండుపల్లె, హరివరం, అల్లూరు, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె తదితర గ్రామాల్లో వెలిసిన శివాలయాల్లో భక్తులు వేకువ జామునే చేరుకుని పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మాయలూరు భీమలింగేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

దొర్నిపాడు: మండలంలో మహాశివరాత్రి పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. రాత్రి శివాలయాల్లో భజనగీతాలు ఆలపించి జాగరణ చేశారు.

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలోని భాస్కరనందీశ్వర స్వామి, వాసాపురం ఆలయ ప్రాంగణంలోని మానస లింగేశ్వరస్వామి, నల్లమల అటవీ ప్రాంతంలోని ఉల్లెడ మల్లేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది. శివరాత్రిని పురస్కరించుకుని భక్తులు ఆయా ఆలయాల్లో స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



కోటా వీధిలో బ్రహ్మనందీశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఉల్లెడ మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తజన సందడి



నంద్యాలలో నగరేశ్వరునికి దానిమ్మ గింజలతో అభిషేకం చేస్తున్న దృశ్యం

కక్ష సాధింపు చర్యలు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): గిరిజన ఉపాధ్యాయుడు రాజునాయుడుపై డీఈఓ కక్ష సాధింపు చర్యలకు దిగడం సరికాదని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బనగానపల్లె పట్టణంలో విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు రాజునాయుడుపై విధించిన సస్పెన్షన్ గడువు ముగిసినా విధుల్లోకి తీసుకోవడం లేదన్నారు. మంత్రి దగ్గర మెప్పు కోసం ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి గిరిజన ఉపాధ్యాయుడిని డీఈఓ వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. తీరు మార్చుకోకపోతే ఆయన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు బాబాఫక్రుద్దీన్, మోటా రాముడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్యప్రతాప్ పాల్గొన్నారు.

వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అర్చక బృందం



అర్చకులను సత్కరిస్తున్న ఆలయ నిర్వాహకులు

రుద్రవరం: పార్వేట ఉత్సవమూర్తులకు పూజలు చేసే అర్చక బృందం బుధవారం మండల పరిధిలోని వెగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ, గోదా సమేత వాసాపురం వెంకటేశ్వరస్వామిని దర్శించు కున్నారు.వారు ఆలయానికి చేరుకోగానే నిర్వాహకులు మధుసూదనరెడ్డి, రంగనాయకులు, నరసింహులు తదితరులు స్వాగతం పలికారు. అనంతరం అర్చక బృందం స్వామి అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. తర్వాత వారిని ఆలయ నిర్వాహకులు సత్కరించి స్వామి వారి జ్ఞాపిక అందజేశారు.

అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలు

రుద్రవరం: ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంలో పెద్దకంబలూరుకు చెందిన ఆదిలక్ష్మి అనే మహిళకు గాయాలయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా శిరివెళ్ల మండలం ఎర్రగుంట్ల నుంచి పుట్టిల్లు అయిన పెద్దకంబలూరుకు వచ్చారు. బుధవారం ఇంటి ముందు వేసిన చలి మంట వద్ద కూర్చొని ఉండగా ప్రమాదవశాత్తు చీర కొంగుకు నిప్పు అంటుకుంది. వెంటనే గట్టిగా కేకలు వేయగా భర్త ఓబులేసు నిప్పును ఆర్పివేశారు. శరీరానికి గాయాలు కావడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఆధ్యాత్మిక విద్య అభ్యసించాలి

ఆళ్లగడ్డ: ప్రతి ముస్లిం ఆధ్యాత్మిక విద్య అభ్యసించాలని ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ జాఫర్ సాధిక్ సూచించారు. పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్‌హాలులో బుధవారం హదియా ఇంటర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఇస్లామిక్ ఆధ్యాత్మిక ప్రవచనాలు, ఖురాన్ సూక్తులు, ప్రవక్త, మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభకనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు ముల్లా షఫివుల్లా

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని మనం బ్లడ్ డోనర్స్ సేవా–సురక్ష బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమానికి యువకుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 70 మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ నాయకుడు చక్రం ముల్లా షబ్బీర్ అహ్మద్, ఏఎస్ఐ అబ్దుల్‌నబీ హాజరయ్యారు. మనం బ్లడ్ డోనర్స్ సేవా సంఘం అధ్యక్షుడు ముల్లా మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఎవరికైనా అత్యవసరమైతే వెంటనే రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతోనే సేవా సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు. గ్రామంలోని యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో సేవా సంఘం ఉపాధ్యక్షుడు మహబూబ్‌బాషా, సెక్రటరీ అమీర్‌బాషా, సభ్యులు ఇమ్రాన్, ఇమాంహుస్సేన్, మోహిద్దీన్, మహబూబ్‌బాషా, మహమ్మద్‌గౌస్, అలీ హుసేన్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్ షరీఫ్, చంద్‌బాషా, మాబూసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



కబడ్డీలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి సందర్భంగా పెట్నికోట సమీపంలోని గుండుమల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలు బుధవారంతో ముగిశాయి. కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. రాయలసీమ జిల్లాలతో పాటు ఇతర జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. పోటీలను తిలకించేందుకు వచ్చిన జనం క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కబడ్డీ పోటీల్లో ప్యాపిలి జట్టు మొదటి బహుమతి కైవసం చేసుకుంది. పెట్నికోట ప్రసాద్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. కల్వటాల జట్టు మూడవ స్థానం, బేతంచెర్ల మండలం ఎంబాయి జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. వీరికి దాతల సహకారంతో జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చేతులమీదుగా వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు,రూ.8వేలను అందించారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో గుంటూరు జట్టు మొదటి బహుమతి సాధించింది. నంద్యాల నందిపైపుల జట్టు రెండు బహుమతి కైవసం చేసుకుంది. విజయవాడ జట్టు మూడవ స్థానం, అనంతపురం జట్టు నాల్గవ స్థానాల్లో నిలబడ్డాయి. విజేత జట్లకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు, రూ.6వేలను అందించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఎర్రబోతుల ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, బహుమతి దాతలు, వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కన్నీటి దిగుబడులు!

- శనగ రైతు కుదేలు
- అనుకూలించని వాతావరణం
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఎకరాకు ఐదు క్వింటాళ్లలోపే దిగుబడులు
- దక్కని గిట్టుబాటు ధర
- ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 17,076 హెక్టార్లలో శనగ సాగు



ఉయ్యాలవాడలో కల్లంలో ఆరబోసిన శనగ దిగుబడులు

ఉయ్యాలవాడ : రబీ సీజన్ రైతులకు కలిసిరాలేదు. సీజన్‌లో సాగు చేసిన వివిధ పంటలకు వాతావరణం అనుకూలించకపోవడంతో దిగుబడులపై పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి. దీనికితోడు ధర లేకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభావం ఎక్కువగా పప్పుశనగ సాగు చేసిన రైతులపై పడింది. ఈ ఏడాది రబీ సీజన్‌లో ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 17,076 హెక్టార్లలో పప్పు శనగ పంట సాగు చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యధికంగా ఉయ్యాలవాడ మండలంలో 12,148 హెక్టార్లలో సాగైంది.

తగ్గిన దిగుబడులు

గతేడాది అక్టోబర్ మొదటి వారం నుంచి శనగ సాగుకు అదును కాగా విత్తన సమయంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. వరణుడిపై భారం వేసి నియోజకవర్గంలోని మండలాల పరిధిలో రైతులు విస్తారంగా పప్పు శనగ సాగు చేశారు. విత్తనాలు, రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, కలుపునివారణ, తదితర పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 15 నుంచి 20 వేలు వెచ్చించారు. కౌలు రైతులపై కౌలు రూపంలో అదనంగా మరో రూ. 20 వేలు భారం పడింది. పంట మార్పిడి విధానం అవలంబించకపోవడం, విత్తన సమయంలో పొలాలను కలియదున్నక పోవడం, మోతాదును మించి రసాయన ఎరువులు వాడటం, వాతావరణం అనుకూలించకపోవడం, తదితర కారణాలతో శనగ పైరును వేరుకుళ్లు (ఎండు తెగులు) ఆశించి పైరులో మొక్కలు ఎండిపోయాయి. పూలేజీ (తెల్లశనగ) రకానికి చెందిన పైరుకు ఎక్కువ శాతం ఎండు తెగులు సోకింది. దీనికితోడు గతేడాది ఆఖరులో తుఫాన్ల ప్రభావంతో కురిసిన వర్షాలు, అధిక తేమ కారణంగా పూత, పిందె రాలిపోయి పంట దెబ్బతినింది. దీంతో పంట దిగుబడులు ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల మధ్య వచ్చాయి.

దక్కని గిట్టుబాటు ధర

ఈ సారి ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తాయనుకుంటే జేజీ– 11 రకానికి చెందిన శనగలో ఎకరాకు 5 క్వింటాళ్లలోపు, పూలేజీ రకంలో 4 క్వింటాళ్ల దిగుబడులు వస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్లు, తెగుళ్ల ఒక వైపు వెంటాడగా పైరు పూత, తట్ట దశలో వారం, పది రోజుల పాటు పొగమంచు కురవడం ద్వారా దిగుబడులపై ప్రభావం పడింది. రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులు, తదితర పెట్టుబడికి తోడు కోత, నూర్పిడికి ఎకరాకు రూ. 2 వేల నుంచి రూ. 2,500 అదనంగా వెచ్చించాల్సి రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనానికి ముందు ఎర్ర శనగలు క్వింటా రూ. 7,500, తెల్లశనగలు రూ. 10 వేలు ధర పలికాయి. ప్రస్తుత మార్కెట్‌లో ఎర్రశనగ క్వింటా రూ. 5,600 , తెల్లశనగ క్వింటా రూ. 6,80 వేలు మాత్రమే ధర పలుకుతుండటంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే కనీసం పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు.దీంతో చాలా మంది రైతులు దిగుబడులను కల్లాల్లో ఉంచుకుని మద్దతు ధర కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

నియోకవర్గంలో సాగైన శనగ పంట వివరాలు

మండలం	హెక్టార్లు
ఉయ్యాలవాడ	12,148
దొర్నిపాడు	2,761
చాగలమర్రి	1,080
ఆళ్లగడ్డ	985
రుద్రవరం	102
శిరివెళ్ల	00

ఎకరాకు 4 క్వింటాళ్లలోపే దిగుబడి



25 ఎకరాల్లో పప్పుశనగ సాగు చేశాను. 15 ఎకరాలు ముందస్తు కౌలుకు తీసుకుని ఎకరాకు రూ. 20 వేలు చెల్లించి తెల్ల శనగ సాగు చేశాను. పెట్టుబడుల రూపంలో ఎకరాకు రూ. 20 వేలు వ్యయం చేశాను. దిగుబడులు ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల లోపు వచ్చాయి. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి మమ్మల్ని ఆదుకోవాలి. లేకపోతే తీవ్ర నష్టంతో అప్పుల పాలు కావాల్సి వస్తుంది.

– చిట్టిపు రాజగోపాల్‌రెడ్డి, రైతు, ఆర్.జంబులదిన్నె

గిట్టుబాటు ధర కల్పించాలి



గత ఏడాది శనగ దిగుబడులకు ఎర్ర శనగలు క్వింటా రూ. 7,500, తెల్లశనగలు రూ. 10 వేలు ధర పలికింది. దీంతో రైతులు ధాన్యాన్ని అమ్ముకుని కొంత వరకు ఊరట చెందారు. ఈ ఏడాది మార్కెట్‌లో ధరలు చాలా తక్కువగా ఉన్నాయి. దీనికితోడు దిగుబడులు సరిగా రాలేదు. ప్రస్తుత ధరకు అమ్ముకుంటే పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదు. 20 ఎకరాల్లో శనగ, 5 ఎకరాల్లో మిరప, 5 ఎకరాల్లో మినుము పంట సాగు చేశాను. ప్రస్తుతం ఏ పంటకు మార్కెట్‌లో ధర లేదు. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలి

– ముసాని శివానందరెడ్డి, రైతు, ఉయ్యాలవాడ

సత్తాచాటిన వెంకటగిరి ఎద్దులు



వృషభ యజమానులకు బహుమతులు అందిస్తున్న గ్రామ పెద్దలు, దాతలు

డోన్ రూరల్ : మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో మహాశివరాత్రి, తిమ్మగురుడు తాత తిరుణాల సందర్భంగా బుధవారం నాలుగు పళ్ల విభాగం వృషభాలకు రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను గ్రామ పెద్దలు నారాయణగౌడ్, మధుసూదన్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం 12 జతల ఎదుదలు పాల్గొనగా.. కర్నూలు జిల్లా , కోడుమూరు మండలం, వెంకటగిరి గ్రామానికి చెందిన షశాంక్‌శ్రేయ వృషభాలు విజేతలుగా నిలిచి రూ.40వేలు కైవసం చేసుకున్నాయి. తరువాత స్థానాల్లో కొత్తూరు గ్రామానికి చెందిన బిఎస్ఎస్. రెడ్డి రూ.30వేలు, వెంకటగిరి గ్రామానికి చెందిన షశాంక్‌శ్రేయ ఎద్దులు రూ.20వేలు, పీఆర్‌పల్లి గ్రామానికి చెందిన రంగనాయకులు ఎద్దులు రూ.10 వేలు, పందిర్లపల్లి గ్రామానికి చెందిన కానాలబాషా వృషబాలు రూ.5వేలు, ఉలిందకొండ గ్రామానికి చెందిన తిమ్మన్న ఎద్దులు రూ.4వేలు, ఏడవ బహుమతి తగ్గలి మండలానికి చెందిన సుస్మిత ఎద్దులు రూ.3వేలను కైవసం చేసుకున్నాయి.